# రైతు కూలీలకు పైసలేవి భట్టీ?

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో భూమిలేని రైతుకూలీలు, నిరుపేదలకు ఏటా రూ.12 వేల చొప్పన ఆర్థికసాయం అందించే పథకం ప్రారంభం.
- ఆరు గ్యారెంటీల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఇది

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిన రోజైన డిసెంబర్ 28 నుంచి భూమి లేని నిరుపేద కూలీలందరికీ రూ.12 వేలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. అదేరోజు మొదటి విడుతగా రూ.6 వేల చొప్పన ఖాతాల్లో జమచేస్తాం.
-ఈ నెల 15న ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన ఇది..

రైతు కూలీలకు ఆర్థిక సాయం కోసం రూ.900 కోట్లు కేటాయిస్తున్నాం. మొత్తం 15 లక్షల మందికి సాయం అందిస్తాం.
- ఈ నెల 23న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పిన లెక్కలివి..

**28న రైతు కూలీలకు 'భరోసా' ఎక్కడ?**
**ఒక్కొక్కరికి 6 వేలు వేస్తామని ప్రకటన**
**గడువు ముగిసినా ఖాతాల్లో పడని డబ్బులు**
**ఇప్పటివరకు కూలీల లెక్క తేల్చని సర్కారు**
**భట్టివి ఉట్టిమాటలేనని విమర్శల వెల్లువ**

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తేతెలంగాణ): రైతు కూలీలకు భరోసా కింద నగదు జమ చేస్తామని భట్టి విక్రమార్క చెప్పిన గడువు శనివారం ముగిసింది. కానీ ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. ఆర్థిక సాయం అందిస్తామని స్వయంగా డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి చెప్పడం, రూ.900 కోట్లు కేటాయిస్తామని ప్రభుత్వంలోనే కీలకమైన మంత్రి ప్రకటించడంతో రాష్ట్రంలోని రైతు కూలీలంతా నమ్మారు. శనివారం నుంచే తమ ఖాతాల్లో రూ.6 వేల చొప్పున జమవుతాయని సంబురపడ్డారు. కానీ.. భట్టి మాట ఉట్టిదేనని, పొంగులేటి ప్రకటనలో పస లేదని తేలిపోయింది. గడువు ముగిసినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడంతో రైతు భరోసా, ధాన్యానికి బోనస్ మాదిరిగానే, రైతు కూలీలకు భరోసా కూడా బోగసేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



### పాలసీ తేలకుండానే ప్రగల్భాలు

ఉపాధిహామీ పథకంలోని జాబ్‌కార్డులను పరిగణనలోకి తీసుకొని భూమిలేని నిరుపేదలను గుర్తిస్తామని ప్రభుత్వం గతంలో చెప్పింది. ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించామని పేర్కొన్నది. భూమిలేని పేదలను గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా సర్వే చేయిస్తున్నామని చెప్పుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో 53.6 లక్షల మందికి జాబ్‌కార్డులు ఉండగా.. వీరిలో వ్యవసాయ భూమి లేనివారు సుమారు 15 లక్షల మంది ఉంటారని ప్రాథమికంగా నిర్ధారించింది. ఇదే సంఖ్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఆ తర్వాత ప్రభుత్వం ఎలాంటి కసరత్తు చేయలేదని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. నిజమైన లబ్ధిదారులు ఎంత మంది? వారికి ఏటా ఎంత జమ చేయాలి? వ్యక్తులకు వేస్తారా.. లేక కుటుంబాలను ప్రామాణికంగా తీసుకుంటారా? ఎంత ఖర్చవుతుంది? వంటివేవీ అధ్యయనం చేయలేదని అంటున్నారు. పైగా సంబంధిత శాఖ నుంచి ప్రతిపాదనలు, ఆర్థిక శాఖ నుంచి అనుమతుల వంటి ప్రక్రియలేవీ జరగలేదని చెప్తున్నారు. అయినా 28 నుంచి ఖాతాల్లో వేస్తామని, రూ.900 కోట్లు ఖర్చు చేస్తామని ఎలాంటి పాలసీ లేకుండానే మంత్రులు ప్రగల్భాలు పలికారన్న విమర్శలు వస్తున్నాయి.

## నిరాశలో నిరుపేదలు

సాక్షాత్తూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పిన గడువు పూర్తయి 48 గంటలు దాటినా నగదు జమ దేవుడెరుగు.. కనీసం మార్గదర్శకాలు కూడా విడుదల కాలేదు. తమ ఖాతాల్లో చిల్లిగవ్వకూడా పడకపోడంతో పేదలు నిరాశలో మునిగిపోయారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు, రైతు రుణమాఫీ, పెన్షన్ పెంపు, రైతు భరోసా తరహాలో ఈ హామీ కూడా అటకెక్కినట్టేనని విమర్శిస్తున్నారు. రైతు కూలీలకు భరోసా ప్రకటించి వెనక్కి తగ్గడంపై రైతు సంఘాల నాయకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి మాటకే విలువలేకుంటే ఈ సర్కారును నమ్మేదెలా? అని మండిపడుతున్నారు. మార్గదర్శకాలు విడుదల చేయకుండానే హడావుడి చేయడం ఎందుకని నిలదీస్తున్నారు. అన్నివర్గాలను మోసం చేసినట్టుగానే నిరుపేద రైతు కూలీలను కాంగ్రెస్ సర్కార్ దగా చేసిందని విమర్శిస్తున్నారు.

# కుటుంబంలో ఒక్కరికే రైతు భరోసా?

మొదటిపేజీ తరువాయి...

వారీగా, సాంకేతిక సర్వేల ఆధారంగా సాగుభూమిని లెక్కగట్టి, సాగు చేస్తున్న భూమికే రైతుభరోసా ఇవ్వాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఆదివారం సమావేశమైన క్యాబినెట్ సబ్ కమిటీ రైతు భరోసా విధివిధానాలపై కసరత్తు చేసింది. కష్టకాలంలో ఉన్న రైతులకు మానవతా దృక్పథంతో ఏ మేరకు సహాయం అందించగలం అనే కోణంలో కాకుండా ఏ మేరకు సహాయాన్ని కుదించవచ్చుననే అంశంపైనే క్యాబినెట్ సబ్ కమిటీ ఎక్కువ సమయం కేటాయించినట్టు తెలుస్తున్నది. తాజా సమాచారం మేరకు క్యాబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయంగా తీసుకున్న నిర్ణయాలను యథాతథంగా అమలు చేస్తే, దాదాపు 20 లక్షలకుపైగా అర్హులైన రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉన్నది.

### ఏడెకరాల సీలింగ్?

ఒక కుటుంబానికి గరిష్ఠంగా ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా పెట్టుబడి సాయం ఇవ్వాలనే విషయం మీదనే క్యాబినెట్ సబ్ కమిటీ మీటింగ్‌లో ఎక్కువ సేపు కసరత్తు జరిగినట్టు తెలుస్తున్నది. పది ఎకరాల లోపు భూమికి రైతు భరోసా ఇవ్వాలని తొలుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదించగా.. మిగిలిన మంత్రులు ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇప్పుడున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అది సాధ్యం కాదని తేల్చిచెప్పినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం తరహాలో ఐదు ఎకరాలకు పరిమితం చేద్దామని సూచించినట్టు సమాచారం. కేంద్రం మాదిరిగా తాము కూడా ఐదు ఎకరాలకే పెట్టుబడి సాయం చేస్తే..! ఆ..క్రెడిట్ కేంద్రానికే వెళ్తుందని, కేంద్రం ఇచ్చిన కిసాన్ సమ్మాన్ పథకానికే రాష్ట్ర ప్రభుత్వం పేరు మార్చి ఇస్తున్నదంటూ బీజేపీ ప్రచారం చేసుకునే అవకాశం ఉన్నదనే చర్చ జరిగినట్టు తెలిసింది. మధ్యే మార్గంగా ఏడెకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలనే ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు సమాచారం. ఒక్క కుటుంబానికి ఎంత భూమి ఉన్నప్పటికీ, ఎంతమంది కుటుంబసభ్యులు ఉన్నప్పటికీ గరిష్ఠంగా ఏడెకరాలకు మించకుండా రైతు భరోసా సాయం అందించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఎక్కువ మంది సంతానం, ఎక్కువ మొత్తంలో భూ విస్తీర్ణం ఉన్న కుటుంబంలో ఎవరికి ఎంత ఇవ్వాలనేది కుటుంబ పెద్ద విచక్షణను పరిగణనలోకి తీసుకొని, స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు నిర్ణయం తీసుకోవాలని ప్రాథమిక ఆలోచన చేసినట్టు తెలిసింది.

### పంటను బట్టి పెట్టుబడి సాయం

ఏకీకృత పంట విధానం కాకుండా, పంట రకాల వారీగా పెట్టుబడి సాయం నిర్ణయించాలనే ప్రతిపాదనపై కూడా క్యాబినెట్ సబ్ కమిటీ చర్చించినట్టు తెలిసింది. ఈ సహాయం ఏడాది మొత్తానికి కలిపి ఒకేసారి ఇవ్వాలా? వానకాలం, యాసంగి సీజన్లకు వేర్వేరుగా ఇవ్వాలా? అనే అంశం మీద చర్చించినట్టు సమాచారం. పత్తి, మిరప పంటలు ఏడాదికి ఒక్కసారి మాత్రమే సాగు చేస్తారని, ఆరు నెలల్లో పంట చేతికి అందుతుందని, ఇక ఆ తరువాత రైతు భూమిని ఖాళీగానే ఉంచుతారని, ఖాళీ భూమికి పెట్టుబడి సాయం ఎందుకు ఇవ్వాలనే ఆలోచన చేసినట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో పండ్ల తోటలకు రైతు భరోసా వర్తింప చేయాలా? వద్దా? అనే అంశం మీద చర్చ జరిగినట్టు సమాచారం. పండ్ల తోటలకు ఒకటి, రెండేండ్లపాటు పెట్టుబడి పెడితే మూడో ఏడాది నుంచి ఫలసాయం అందుతుందని, ఫలసాయం అందే సమయంలో రైతు భరోసా అవసరం లేదని సబ్ కమిటీ అభిప్రాయపడ్డట్టు తెలిసింది. సాగు మీద ప్రతి సీజన్‌లో సర్వే చేయాలని, ఇందు కోసం నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ సహకారం తీసుకోవాలని, ఎంత భూమి సాగు చేశారో.. సీలింగ్ పరిమితికి లోబడి అంతే భూమికి పెట్టుబడి సాయం అందజేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఏడాదికి మూడుసార్లు సాగు చేసే వరి లాంటి పంటలకు ఏడాదికి రెండు సీజన్లు మాత్రమే పెట్టుబడి సాయం చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. తద్వారా వానకాలంలో వచ్చే పెట్టుబడి సాయానికి, యాసంగిలో అందించే సాయానికి మధ్య ప్రభుత్వానికి కొంత మిగులుబాటు ఉంటుందని ఆలోచన చేసినట్టు తెలుస్తున్నది.



### రైతులు, పెట్టుబడి సాయంలో తగ్గుదల

కొత్త మార్గదర్శకాలతో లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గుతుందని సమాచారం. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించారు. వారికి ఇతోధికంగా సహాయపడాలనే ఆలోచన చేసేవారు. రైతు బంధు పథకం కింద 65 లక్షల మంది రైతులకు, 1.49 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందించారు. నిజానికి, రాష్ట్రంలో ఒక హెక్టారు లేదా అంత కన్నా తక్కువ భూమి ఉన్న సన్నకారు రైతులు 47.86 లక్షల (74%) మంది ఉన్నారు. రెండు హెక్టార్ల భూమి ఉన్న చిన్నకారు రైతులు 11.50 లక్షల (18%) మంది ఉన్నారు. సన్న, చిన్నకారు రైతుల వాటానే 92% ఉన్నది. ఏటా సగటున రూ.13 వేల కోట్ల చొప్పున ఆరేండ్లలో రూ.80,453.41 కోట్లు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రైతన్నల ఖాతాల్లో జమ చేసింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్దయతో ఆలోచన చేస్తున్నది. ఒక కుటుంబంలో ఏడు ఎకరాలు అనే సీలింగ్ పరిమితి పెట్టటం, మరికొన్ని సాంకేతిక అవరోధాలు సృష్టించటం ద్వారా గరిష్ఠంగా 40 లక్షల నుంచి 45 లక్షల మించి రైతులకు రైతు భరోసా అందే అవకాశం లేదని, కనీసం 20 లక్షల మంది అర్హత ఉన్న రైతులకు కూడా పెట్టుబడి సాయం అందక పోవచ్చని వ్యవసాయరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ఆర్థిక ఇబ్బందున్నాయ్.. అయినా ఇస్తం: భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): రైతు భరోసా ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చినమాట మేరకు ముందుకు వెళ్తామని రైతు భరోసా విధివిధానాల కోసం ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. సచివాలయంలో ఆదివారం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సబ్ కమిటీ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశమయ్యారు. యాసంగి పంటకు రైతు భరోసా అందజేసేందుకు ఖరారు చేయాల్సిన విధి విధానాలపై రెండు గంటలపాటు కసరత్తు చేశారు. క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన క్రమంలో రైతులు వ్యక్తంచేసిన అభిప్రాయాలతోపాటు అధికారులు సేకరించిన సమాచారంపై చర్చించారు. రైతులకు బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించడమే కాకుండా రుణమాఫీ చేశామని, బోనస్ ఇస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

## రైతులకు రుణాలివ్వండి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): రైతులకు త్వరితగతిన కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని సహకార బ్యాంకులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం ఆయన కోఠిలోని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టీజీక్యాబ్)ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ తోపాటు బ్యాంక్ పనితీరు, ఆర్థిక అంశాలపై సమీక్షించారు. డీసీసీబీల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా టీజీక్యాబ్ నూతన డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో టీజీక్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# నాడు కరోనా.. నేడు కాంగ్రెస్

- రాష్ట్ర చరిత్రలో రెండోసారి ఆదాయ వృద్ధికి బ్రేకులు
- 2020లో కరోనాతో 7 శాతం తగ్గిన ఆదాయం
- కాంగ్రెస్ పాలనలో ఈ ఏడాది మళ్లీ అదే సీన్
- కేసీఆర్ పాలనలో ఏటేటా రెవెన్యూ రాబడిలో వృద్ధి
- తొమ్మిదేండ్లలో రెండున్నర రెట్లు పెరుగుదల



**పదేండ్లుగా నవంబర్ నాటికి రెవెన్యూ రాబడిలో పెరుగుదల ఇలా..**

| ఆర్థిక సంవత్సరం | ఆదాయం (రూ.కోట్లలో) | మార్పు (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2015-16 | 41,049.26 | - |
| 2016-17 | 45,190.73 | 4,141.47 |
| 2017-18 | 52,733.13 | 7,542.4 |
| 2018-19 | 58,651.92 | 5,918.79 |
| 2019-20 | 61,862.58 | 3,210.66 |
| 2020-21 | 56,948.02 (కొవిడ్) | -4,914.56 |
| 2021-22 | 74,940.86 | 17,992.64 |
| 2022-23 | 96,615.19 | 21,674.33 |
| 2023-24 | 1,11,141.37 | 14,526.18 |
| 2024-25 | 1,03,300.04 | - 7,841.23 |

**ఈ ఏడాది ఆదాయ లక్ష్యం:** 2,21,242.23 కోట్లు
**నవంబర్ నాటికి వచ్చింది:** 1,03,300.04 కోట్లు
**లక్ష్యంలో సాధించిన శాతం:** 46.69%

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఖజానాకు కష్టకాలం మొదలైంది. అన్ని రంగాల్లో స్తబ్ధత నెలకొనడంతో అభివృద్ధికి బ్రేకులు పడుతున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పాలనలో ఆర్థిక రంగ వృద్ధి 'కరోనా' కాలాన్ని తలపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కాగ్‌కు సమర్పించిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. రెవెన్యూ రిసిప్ట్‌లను పరిశీలిస్తే.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు రాష్ట్ర ఖజానాకు వివిధ మార్గాల ద్వారా రూ.1,03,300.04 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోల్చితే రూ. 7,841.23 కోట్ల తగ్గుదల నమోదైంది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఇలా ఆదాయం తగ్గడం ఇది రెండోసారి మాత్రమే. 2020-21 ఆర్థిక సంవత్సరంలో కరోనా కారణంగా 7% ఆదాయం తగ్గగా.. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మరోసారి 7% తగ్గుదల నమోదైంది.

### ఏటేటా పెరిగిన ఆదాయం

రాష్ట్ర ఖజానాకు వివిధ మార్గాల ద్వారా ఆదాయం సమకూరుతున్నది. జీఎస్టీ, సేల్స్‌ట్యాక్స్, ఎక్సైజ్ డ్యూటీ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, ల్యాండ్ రెవెన్యూ, కేంద్ర పన్నుల్లో వాటా వంటివి పన్ను ఆదాయం కాగా, పన్నేతర ఆదాయం, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ల రూపంలో ఖజానాకు నిధులు చేరుతాయి. వీటన్నింటినీ రెవెన్యూ రిసిప్ట్‌లుగా పిలుస్తుంటారు. వీటిని రాష్ట్రానికి వచ్చు ఆదాయంగా పరిగణిస్తారు. రుణాలు సేకరించడం ద్వారా సమకూరే నిధులను క్యాపిటల్ రిసిప్ట్‌గా పేర్కొంటారు. ఆదాయం పెరగడాన్ని (రెవెన్యూ రిసిప్ట్) రాష్ట్ర అభివృద్ధికి సూచికగా భావిస్తుంటారు. 2015 నుంచి 2023 వరకు పరిశీలిస్తే.. కేసీఆర్ పాలనలో ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య ఆదాయం ఏటా పెరిగింది. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు వంటివి ఆదాయాన్ని పెంచడానికి దోహదం చేశాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఐటీ, రియల్‌ఎస్టేట్, పరిశ్రమలు, నిర్మాణ రంగం.. ఇలా అన్ని రంగాల్లోనూ వృద్ధి సాధించడంతో ఆదాయం ఏటేటా గణనీయంగా పెరిగింది. తొమ్మిదేండ్లలో సగటున 12.54% ఆదాయ వృద్ధి రేటు నమోదైంది. 2015లో నవంబర్ నాటికి ఆదాయం రూ.41,049.26 కోట్లు ఉండగా, 2023 నాటికి రూ.1,11,141.37 కోట్లకు చేరింది. అంటే.. రెండున్నర రెట్లు పెరిగింది.

### కరోనాతో బ్రేకులు.. వెంటనే జెట్ స్పీడ్

కేసీఆర్ పాలనలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే ఆదాయ వృద్ధి మైనస్‌లో నమోదైంది. ఆ ఏడాది కరోనా దెబ్బకొట్టడంతో అంతకు ముందు ఏడాదితో పోల్చితే దాదాపు 8% ఆదాయం పడిపోయింది. కానీ.. మరుసటి సంవత్సరంలో గోడకు కొట్టిన బంతిలా రెట్టింపు వేగంతో అనూహ్య వృద్ధి సాధించింది. 2021-22లో ఏకంగా ఆదాయ వృద్ధి 31.59% నమోదైంది.

### అసంబద్ధ విధానాల ఫలితం

కొవిడ్ కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రెండోసారి ఆదాయ వృద్ధికి బ్రేకులు పడ్డాయి. 2023తో పోల్చితే ఈసారి 7% పడిపోయింది. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వ అసంబద్ధ విధానాలే కారణమని నిపుణులు చెప్తున్నారు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేయడం, రైతుబంధు ఎగ్గొట్టడంతో వ్యవసాయ రంగం దెబ్బతిన్నదని, విచ్చలవిడి వసూళ్లు, హైడ్రాతో రియల్‌ఎస్టేట్ రంగం కుప్పకూలిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛ్ బయోగ్రీన్ వంటి ఘటనలతో ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయి పరిశ్రమల రాక ఆగిపోయిందని అంటున్నారు. కంపెనీలు వెనక్కి వెళ్లిపోతున్న పరిస్థితి ఉన్నదని చెప్తున్నారు. దీంతో రాష్ట్ర ఆదాయం పడిపోయిందని భావిస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో మొదటి సంవత్సరమే ఇలా ఉంటే రానురాను రాష్ట్ర పరిస్థితి ఎలా మారుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## మేడిగడ్డకు 10,130 క్యూసెక్కుల ప్రవాహం

మహదేవపూర్, డిసెంబర్ 29 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఆదివారం బరాజ్ ఇన్‌ఫ్లో 10,130 క్యూసెక్కులు కాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత వరద ప్రవాహం రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 89.20 మీటర్ల ఎత్తులో ఉన్నదని, ప్రవాహం తగ్గే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు.

# కాస్తు కాలమ్.. మళ్లీ కష్టకాలం




మొదటిపేజీ తరువాయి...

మారేది. 2020 కొత్త ఆర్వోఆర్ చట్టంతో కేసీఆర్ ప్రభుత్వం ఈ అనుభవదారు కాలమ్‌ను ఎత్తేసింది. దీంతో గుండెలమీద కుంపటి తొలిగినంత పనైందని లక్షలాది మంది రైతులు సంతోషం వ్యక్తంచేశారు. ఆ ఆనందం నాలుగేండ్లు కూడా నిలవలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు 'భూ భారతి' పేరుతో తీసుకొస్తున్న కొత్త చట్టంలో అనుభవదారు కాలమ్‌ను చేర్చింది. పైగా 2014 వరకు రికార్డుల్లో అనుభవదారులుగా ఉన్న వారి పేర్లను చేర్చుతామని ప్రకటించింది. వారికి హక్కులు సైతం కల్పిస్తామని చెప్పింది. దీంతో రైతుల్లో మళ్లీ భయాందోళనలు మొదలయ్యాయి.

### కాస్తులోకి వచ్చి.. ఆస్తి కాజేసి..

గతంలో అనుభవదారు కాలమ్ వల్ల చాలా మంది రైతుల తలరాతలు తలకిందులయ్యాయి. కొందరు అక్రమార్కులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై భూములను గుంజుకొని అన్నదాతల జీవితాలను రోడ్డున పడేశారు. ముందుగా ప్రణాళిక ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో అనుభవదారు కాలమ్‌లో పేరు రాయించుకునేవారు. ఈ విషయం రైతులకు కూడా తెలిసేది కాదు. కొన్నేండ్లు అనుభవదారుగా కొనసాగిన తర్వాత పేరును పట్టాదారు కాలమ్‌లోకి మార్చి.. అసలు రైతు పేరును తొలిగించేవారు. ఈ విషయం కూడా రైతులకు తెలిసేది కాదు. రైతు అవసరానికి భూమిని అమ్మాలని భావించినప్పుడు ఈ విషయం బయటపడేది. దీంతో రైతులు తమ భూమిని ఇప్పించాలంటూ రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. కోర్టులకు వెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉండేది కాదు. ఏండ్లపాటు రికార్డుల్లో అసలు రైతు స్థానంలో అక్రమార్కుల పేర్లే కనిపించడంతో సాంకేతికంగా అక్రమార్కులే పైచేయిగా నిలిచేవారు. ఫలితంగా రైతులు రోడ్డున పడేవారు. రైతులకు గొడవలు, ఘర్షణలు వంటివి నిత్యకృత్యం అయ్యేవి. దాడులు, ప్రతిదాడులు, పోలీస్‌స్టేషన్లు, కోర్టులు అంటూ ఏండ్లకేండ్లు వివాదాలు కొనసాగేవి.

### సొంత భూమికి దూరమైన అన్నదమ్ములు

మంచిర్యాల జిల్లాలో ఓ రైతుకు 1953 నుంచి 7.16 ఎకరాల పట్టా భూమి ఉండేది. ఆయన మరణానంతరం ఇద్దరు కొడుకులు సమానంగా భూమిని పంచుకున్నారు. 1993లో అప్పటి వీఆర్వో లంచం తీసుకొని పహాణీలో ఆ భూమిని వేరే వ్యక్తికి రాసేశారు. దీంతో అన్నదమ్ములు దశాబ్దాలపాటు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. పరిశీలిస్తే అనుభవదారుగా ఉన్న వ్యక్తి పేరుమీదికే ఆ భూమి మారినట్టు తేలింది. ఇలా రైతులకు తెలియకుండానే మారిపోయిన స్థలాలు ఎన్నో ఉన్నాయి.

### ప్రభుత్వ భూములకూ ఎసరు

అనుభవదారు కాలమ్‌తో రైతులకే కాదు ప్రభుత్వ భూములు, దేవుడి మాన్యాలు సైతం ఆక్రమణలకు గురయ్యాయి. ఆలయాల్లో పనిచేసినవారు, ధర్మకర్తల వంటివారు ఆలయాల మాన్యాల భూముల్లో అనుభవదారుగా చేరి, కొన్నేండ్ల తర్వాత పట్టాదారుగా రికార్డుల్లో మార్పించుకునేవారు. ఇలా వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయి. ఉప్పల్ నియోజకవర్గంలోని ఓ ప్రముఖ ఆలయానికి చుట్టూ ఉన్న వివిధ గ్రామాల్లో భూములు ఉన్నాయి. దేవుడి పేరుతోనే ఉన్న ఓ పూజారి కుటుంబం ముందుగా అనుభవదారు కాలమ్‌లో చేరింది. ఆ తర్వాత కొన్నేండ్లకు దేవుని పేరు తీసేసి, పట్టాదారు పేరులోకి తమ పేరును మార్చుకున్నది. ఆ కుటుంబానికి చెందిన వ్యక్తి దేవాదాయ శాఖలోనే పనిచేయడంతో సులువుగా భూముల రికార్డులు మారిపోయాయని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములదీ ఇదే పరిస్థితి.

### కాలగర్భంలోకి కాలమ్‌లు

'ఇల్లు కిరాయికి ఇచ్చినట్టే కౌలు పేరుతో పొలాన్ని కిరాయికి ఇస్తారు. కబ్జాదారు కాలమ్ పెట్టి కిరాయికి ఉన్న వ్యక్తికి ఇంటిపై హక్కులు ఇస్తామంటే ఒప్పుకుంటారా? మరి కౌలుకు తీసుకున్న వారికి భూమిపై హక్కులు ఎందుకు ఇవ్వాలి?' అని కేసీఆర్ పదే పదే ప్రశ్నించేవారు. అందుకే 2020లో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని ప్రవేశపెట్టారు. అన్నిరకాల రికార్డుల స్థానంలో ఒకే ఒక ఆన్‌లైన్ రికార్డును అందుబాటులోకి తెచ్చారు. దీంతో అనుభవదారు/కౌలు కాలమ్ కాలగర్భంలో కలిసిపోయింది.

### రైతునెత్తిన మళ్లీ పిడుగు

భూభారతి కొత్త చట్టంలో మళ్లీ అనుభవదారు కాలమ్ పెట్టి కాంగ్రెస్ సర్కారు రైతులపై పిడుగు వేసింది. కౌలుదారులకు మళ్లీ భూ హక్కులు కల్పిస్తామని స్పష్టం చేసింది. పైగా 2014కు ముందున్న అనుభవదారుల పేర్లను యథాతథంగా మళ్లీ తీసుకొస్తామని చెప్పింది. ఓవైపు వీఆర్వోలను తెస్తుండటం, మరోవైపు అనుభవదారులు వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా నిరక్ష్యరాస్యులైన రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు పొలంపై సంపూర్ణ హక్కులు ఉన్నాయన్న భరోసా ధరణి ఇస్తే.. భూ భారతితో కాంగ్రెస్ ప్రభుత్వం అభద్రత కల్పిస్తున్నదని, కంటిమీద కునుకు లేకుండా ఇబ్బంది పెడుతున్నదని అన్నదాతలు ప్రభుత్వంపై ధ్వజమెత్తుతున్నారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 12.9°c | 31.9°c |
| ఆదిలాబాద్ | 14.6°c | 31.7°c |
| మెదక్ | 16.3°c | 29.3°c |
| మహబూబ్‌నగర్ | 17.0°c | 30.0°c |
| నల్లగొండ | 17.2°c | 31.0°c |
| కరీంనగర్ | 18.0°c | 31.0°c |
| ఖమ్మం | 18.0°c | 30.0°c |
| హైదరాబాద్ | 18.0°c | 30.0°c |
| వరంగల్ | 18.0°c | 29.0°c |
| నిజామాబాద్ | 19.7°c | 33.0°c |

## రుణమాఫీ కోసం వినూత్న నిరసన

**ఒంటి కాలిపై నిలబడిన రైతులు**

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 29: రుణమాఫీ పై ప్రభుత్వం మాట తప్పిందంటూ హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం పంగిడిపల్లి రైతులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా రుణమాఫీ చేయలేదని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2 లక్షలకుపైగా రుణం ఉంటే మిగతా డబ్బులు బ్యాంకులో చెల్లించాలని మంత్రులు చెప్పడంతో అప్పులు తెచ్చి మరీ డబ్బులు చెల్లించామని, నెలలు గడుస్తున్నా మాఫీ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2 లక్షల కంటే 200 నుంచి 300 వందలకు పైబడి అప్పు ఉందన్న నెపంతో తమకు రుణమాఫీ చేయడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పష్టతనివ్వకుంటే ఈ ఉద్యమాన్ని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని హెచ్చరించారు. ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుభరోసా ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రెండు పంట కాలాలు పూర్తయినా ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా రైతులే స్వచ్ఛందంగా నిరసనకు దిగడం చర్చనీయంగా మారింది.

## ఫార్మా.. గో బ్యాక్!

మొదటిపేజీ తరువాయి...

రేవంత్‌రెడ్డి మాత్రం ఫార్మాసిటీ, ఫ్యూచర్‌సిటీ, ఫోర్త్ సిటీ, ఏఐసిటీ అంటూ రోజుకోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. యాచారం, కందుకూరు మండలాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రాంతాలు ఖాళీ చేయాల్సి వస్తుందని, మంచినీరు, చెరువునీరు కలుషితమవుతుందని, ప్రజలు రోగాల బారిన పడతారని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని రైతుల తరపున డిమాండ్ చేశారు. బేగరికంచెలో రైతులకు ఇచ్చిన ప్లాట్లను వెంటనే వారికి కేటాయించాలని కోరారు. రైతులకు అండగా ఉండాల్సిన కాంగ్రెస్ నేతలు ఫార్మా రద్దు విషయంలో మౌనం వహించడం సరికాదని సూచించారు. యాచారం, కందుకూరు మండలాల ఫార్మా బాధితులు, రైతులు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లగచర్ల రైతులు, ఇథనాల్ ఫ్యాక్టరీ బాధితుల తరహాలోనే సర్కారుపై సమరం చేయాలని కోరారు. ఏదేమైనా యాచారానికి ఫార్మాను రానిచ్చేది లేదని స్పష్టంచేశారు. ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీకి మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలతో పాటు కందుకూరుకు చెందిన రైతులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఇకపై నిత్య ఉద్యమాలతో సర్కారుకు ఫార్మా రైతుల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా రైతుల తరపున ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తిచేశారు. డిసెంబర్ 30న తాటిపర్తి, 31న నానక్‌నగర్, జనవరి 1న మేడిపల్లిలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక పోరాట సమితి నాయకులు కుందారపు సత్యనారాయణ, కానమోని గణేశ్, సామ నిరంజన్, అచ్చిరెడ్డి, మహిపాల్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

### అన్నారం బరాజ్‌లో ప్రారంభమైన వేవ్ పరీక్షలు

మహదేవపూర్ (కాళేశ్వరం) డిసెంబర్ 29 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బరాజ్ వద్ద పుణె నిపుణుల బృందం ఆధ్వర్యంలో పారాలాల్ సిస్మిక్ వేవ్ (తరంగాలు) మెథడ్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పుణెకు చెందిన నిపుణుడు ధనుంజయ్ నాయుడు బృందం సభ్యులు వివేక్, ప్రశాంత్, శివంగ్ బరాజ్‌లోని వెంట్ల మధ్యలో తరంగాల పరీక్షలు నిర్వహించారు. ఈ వేవ్ పరీక్షలు మరో మూడు నాలుగు రోజులపాటు పూర్తిస్థాయిలో నిర్వహించి, నివేదికను పుణెలోని సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌కు అందజేయనున్నట్టు వారు పేర్కొన్నారు.

## నేడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

**మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించనున్న సభ**

హైదరాబాద్, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానున్నది. ఈ నెల 26న తుది శ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించనున్నది. ఈ మేరకు ప్రభుత్వం రెండు రోజుల క్రితమే అసెంబ్లీ ప్రత్యేక సమావేశంపై నిర్ణయించిన విషయం తెలిసిందే. సభ ఉదయం 10గంటలకు ప్రారంభం కానుండగా, సభ్యులంతా మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవల్ని స్మరించుకోవడంతోపాటు నివాళులర్పించనున్నారు. అనంతరం సభ నిరవధిక వాయిదా పడనున్నది. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని తన మేధస్సుతో గట్టెక్కించడమే కాకుండా పదేండ్లు ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఎన్నో చిరస్మరణీయ పథకాలను అమలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుర్తుచేస్తూ ఘనంగా నివాళి అర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నది.